# సీఎంవో హ్యాండిలా? కాంగ్రెస్ హ్యాండిలా?


- ముఖ్యమంత్రి కార్యాలయ ఎక్స్ ఖాతాలో బూతులా?
- సీఎం చేసిన రాజకీయ విమర్శలనూ పోస్ట్ చేస్తారా?
- సీఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ
- ఐఅండ్‌పీఆర్ కమిషనర్ అశోక్‌రెడ్డికి సర్కారు ఉద్వాసన

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): సీఎంవో ట్విట్టర్ (ఎక్స్) ఖాతా అంటే దేశంలోని అన్ని ప్రభుత్వాలు ఫాలో అవుతాయి. ఈ హ్యాండిల్ ద్వారానే రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని అందరూ తెలుసుకొంటారు. అలాంటి అకౌంట్ చాలా హుందాగా, గౌరవప్రదంగా నిర్వహించాలి. దీని నిర్వహణకు ప్రొఫెషనల్ నైపుణ్యం అవసరం. ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ పెట్టి రాజకీయాలు మాట్లాడినా వాటిని పరిహరించి ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు మాత్రమే ఇందులో పోస్ట్ చేయాలి. ఒకవేళ సీఎం ఆవేశానికి లోనై పొరపాటున తప్పుగా మాట్లాడితే దాన్ని నిర్వహిస్తున్నవారు సరిదిద్ది పెట్టాలి. కానీ తెలంగాణ ప్రభుత్వ తీరు ఎట్లుందంటే సీఎంవో అధికారిక అకౌంట్లో బూతులు పెట్టే స్థాయికి దిగజారింది. కేటీఆర్‌ను డ్రామారావు అని సీఎం అంటే అదికూడా ఆ అకౌంట్‌లో ఉంటుంది. తెలంగాణ ఉద్యమనేత, ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను రాజకీయ ప్రయోజనాల కోసం ప్రస్తుత సీఎం కొన్ని బూతులు తిడితే అది కూడా అకౌంట్‌లోకి వచ్చేస్తుంది. దీనిపై సోషల్‌మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ఇది సీఎం అధికారిక అకౌంటా? లేక వ్యక్తిగత ఖాతానా? దీన్ని నిర్వహిస్తున్నది ఐఏఎస్ అధికారా? లేక ఓ నిరక్షరాస్యుడా? అని నెటిజన్లు మండిపడుతున్నారు. దేశం మొత్తం ఫాలో అయ్యే సీఎంవో ఖాతా నిర్వహిస్తున్న ఐఅండ్ పీఆర్ కమిషనర్ అశోక్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని వెంటనే పలువురు సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. దావోస్ పర్యటన సందర్భంగా సర్కారు అభాసు పాలవడానికి ఈ అధికారే కారణమని గతంలో కూడా ఆరోపణలు వచ్చాయి. దీంతో పరిస్థితి చేయిదాటి పోతుందని గమనించిన కాంగ్రెస్ సర్కారు అశోక్‌రెడ్డికి వెంటనే ఉద్వాసన పలికింది.


TG @gnanesh_ · 1h
CMO Page lo ee Chillara Rathalu endhi asalu...
2 · 211


TCM @TheCommonMan004 · 46m
ప్రభుత్వ హ్యాండిల్ ని కాంగ్రెస్ పార్టీ హ్యాండిల్ లా వాడకండయ్యా...
1 · 108

Venkata Ramana @kandivenkat · 50m
Wondering if this is official CMO Handle or is being operated by Congress IT Cell?
86


office handle అనుకుంటున్నారా CS madam గారు బుద్ధి జ్ఞానము ఉండక్కర్లేదా
1 · 6 · 355

Swamy @SGovin7 · 2h
Is this official account or personal/ party account? #justasking
3 · 200

Rock sathish Netha @NethaRock · 1h
రండా మాటలు మాట్లాడిన వాడికి తెలివి లేదు గా ప్రభుత్వ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ పోస్ట్ పెట్టిన మీ తెలివి ఏమ్ అయింది


GSR V @GSRV32742 · 1h
Replying to @TelanganaCMO @revanth_anumula and @UttamINC
Official handle ni chetha kuppa chesinar kadara nayana.
Gumpu mestri inkeni marpulu chestado
2 · 257

Moye Moye @Anilkum28294303 · 3h
Replying to @TelanganaCMO @revanth_anumula and @UttamINC
ఇంకా నయ్యం రండా అనే పదాలు రాయలేదు, అవి కూడా రాసేది ఉండె, మేము పార్టీ హ్యాండిల్ అని అన్ ఫాలో చేసేవాళ్ళం #Telangana
1 · 12 · 767

Suchitra Varkal @SuchitraVarkal · 3h
Replying to @TelanganaCMO @revanth_anumula and @UttamINC
This is highly objectionable to see such derogatory statements from the CMO official handle. This is not a personal handle or a party handle to use such awkward language addressing the public elected MLAs, how can even the CM Revanth Reddy encourage such things. This is not right
2 · 4 · 18 · 705

# అశోక్‌రెడ్డి ఔట్

- ఐ&పీఆర్ కమిషనర్‌గా తొలగింపు
- కొత్త కమిషనర్‌గా ఎం హన్మంతరావు
- తొమ్మిదిమంది ఐఏఎస్‌ల బదిలీలు


హన్మంతరావు

రాష్ట్రంలో 9 మంది ఐఏఎస్‌లు, ఒక ఐఎఫ్ఎస్ అధికారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అసమర్థ అధికారిగా విమర్శలు ఎదుర్కొన్న సమాచారశాఖ కమిషనర్ కే అశోక్‌రెడ్డికి ఉద్వాసన పలికింది. ఆయన స్థానంలో ఎం హన్మంతరావును నియమించింది. అశోక్‌రెడ్డికి హార్టికల్చర్ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించింది. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి నవీన్‌నికోలస్‌ను టీఎస్‌పీఎస్సీ సెక్రటరీగా బదిలీ చేసింది. జూపార్క్ డైరెక్టర్ వీఎస్ఎన్వీ ప్రసాద్‌కు సివిల్ సప్లయ్ డైరెక్టర్‌గా, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ బీ బాలమాయదేవిని బీసీ వెల్ఫేర్ కమిషనర్‌గా, టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ అనితా రామచంద్రన్‌ను పంచాయతీరాజ్ కమిషనర్‌గా, ఫిషరీస్ కమిషనర్‌గా బీ గోపీ, స్త్రీ శిశు సంక్షేమ, ఎస్సీ వెల్ఫేర్ కమిషనర్‌గా ఏ నిర్మల కాంతివెస్లీ, సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా కే సీతాలక్ష్మిని, వెయిటింగ్‌లో ఉన్న జీ ఫణీంద్రరెడ్డిని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

# 'నమస్తే' ఆటో ఎక్స్‌పో గ్రాండ్ సక్సెస్

- ప్రజల నుంచి విశేష స్పందన
- చివరి రోజూ పోటెత్తిన సందర్శకులు
- దిగ్విజయంగా ముగిసిన ప్రదర్శన

రఘునాథపాలెం, ఫిబ్రవరి 4: వాహన ప్రేమికుల కోసం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో రెండ్రోజుల పాటు 'నమస్తే తెలంగాణ', తెలంగాణ టుడే' పత్రికల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో ఎక్స్‌పో దిగ్విజయంగా ముగిసింది. ఈ ప్రదర్శనకు చివరి రోజైన ఆదివారం సెలవు దినం కావడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ఎంతో మంది సందర్శకులు ఈ ప్రదర్శనకు పోటెత్తారు. వివిధ ఆటోమొబైల్ కంపెనీల స్టాళ్లను సందర్శించి వాహనాలను టెస్ట్ రైడ్ చేశారు. అక్కడే అందుబాటులో ఉన్న బ్యాంకర్లను సంప్రదించి ఆయా వాహనాల కొనుగోలుకు కల్పిస్తున్న రుణ వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం పలువురు కొనుగోలుదారులు అక్కడికక్కడే వాహనాలను బుక్ చేసుకున్నారు. ఆటో ఎక్స్‌పో ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. అనేక దిగ్గజ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వాహన ప్రేమికులు అబ్బురపడేలా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఒకవైపు తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్య భూమిక పోషిస్తున్న 'నమస్తే తెలంగాణ', తెలంగాణ టుడే' పత్రికలు మరోవైపు ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం గొప్ప విషయమని ప్రశంసించారు. అనంతరం బంపర్ డ్రాలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ఈ ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేసిన వివిధ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకర్లకు జ్ఞాపికలు, ప్రత్యేక గిఫ్ట్ హ్యాంపర్లు అందజేశారు. కార్యక్రమంలో 'నమస్తే తెలంగాణ' బీఎం రేనా రమేశ్, బ్యూరో ఇన్‌చార్జి మాటేటి వేణుగోపాల్, యాడ్స్ డిప్యూటీ మేనేజర్ బోయిన శేఖర్ బాబు, సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆటో ఎక్స్‌పోలో ఓ వాహనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్


ప్రదర్శనకు విచ్చేసిన వాహన ప్రేమికులు

# దళితబంధు రాలేదని ఆత్మహత్యాయత్నం

- వారం కిందట ఒకరు.. తాజాగా మరో లబ్ధిదారు
- కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వీణవంకలో ఘటనలు


జమ్మికుంటలో చికిత్స పొందుతున్న దళితబంధు లబ్ధిదారు గాజుల అమల

కరీంనగర్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ)/జమ్మికుంట/వీణవంక: దళితబంధు రెండో విడత నిధులు రావడం లేదని లబ్ధిదారులు మనస్తాపం చెందుతూ ఆత్మహత్యలకు యత్నిస్తున్నారు. ఇక దళితబంధు నిధులు ఇవ్వరేమోనన్న నిరాశతో కరీంనగర్ జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు లబ్ధిదారులు బలవన్మరణానికి సిద్ధపడ్డారు. వారం రోజుల కింద ఒకరు.. ఆదివారం మరొకరు ఆత్మహత్యాయత్నం చేశారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన గాజుల అమల-ప్రవీణ్ దళితబంధు పథకం కింద స్థానికంగా ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకున్నారు. మొదటగా రూ.5 లక్షలు మంజూరు కాగా కెమెరాలు తెచ్చుకున్నారు. మిగతా రూ.5 లక్షలు వస్తాయన్న ఆశతో అమల తన బంధువుల దగ్గర రూ.3 లక్షలు అప్పుచేసి లెన్స్, పెద్ద కెమెరా తదితర సామగ్రి కొనుగోలు చేసింది. అయితే.. పెండింగ్‌లో ఉన్న దళితబంధు నిధులను ప్రభుత్వం ఇవ్వకపోవడం, అప్పు ఇచ్చిన వాళ్లు అడగడంతో.. ఇక దళితబంధు రాదేమోనని మనస్తాపం చెందిన అమల విషం తాగింది. గమనించిన అమల భర్త ప్రవీణ్ వెంటనే జమ్మికుంటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించాడు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. రెండో విడత నిధులు వస్తే అప్పులు తీర్చేద్దామనుకున్నామని తెలిపాడు. ఇటు సీజన్ లేక రూమ్ కిరాయి కూడా ఎల్లడం లేదని, మరోవైపు అప్పులోళ్లకు ఇచ్చిన టైం దాటిపోవడంతో వారు ఇంటికి వస్తరేమోనన్న భయంతో తన భార్య అమల విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నదని వాపోయాడు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రెండో విడత డబ్బులు రిలీజ్ చేయ్యాలని వేడుకున్నాడు. విషయం తెసుకున్న హుజూరాబాద్ నియోజకవర్గ దళితబంధు సంఘం నాయకులు అమలను పరామర్శించారు. ధైర్యం చెప్పి భరోసా కల్పించారు.

## అప్పులు తీర్చే దారిలేక..


బాధితుడు బొడికెల శ్రీనివాస్

ఇక.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి(చర్చి ఏరియా)కు చెందిన బొటికెల మొగిలి-సరోజనకు రాజేశ్, సుమన్, శ్రీనివాస్ ముగ్గురు కుమారులు. వీరు దళితబంధు పథకానికి ఎంపికయ్యారు. శ్రీనివాస్ డీజే యూనిట్ పెట్టుకున్నాడు. యూనియన్ బ్యాంకులో ఖాతా తీసిన శ్రీనివాస్‌కు 2022 జూలై 1న రూ.10 లక్షలు జమయ్యాయి. డీజే యూనిట్‌కు తొలి విడత కింద అదే నెల 25న రూ.5 లక్షలు వచ్చాయి. రెండో విడత వస్తాయని డీజే అదనపు పరికరాల కొనుగోలు కోసం రూ.లక్షా 90 వేలకు పైగా అప్పులు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధుల విడుదల ఆగిపోయింది. శ్రీనివాస్‌కు అప్పులోళ్ల ఒత్తిడి ఎక్కువైంది. సీజన్ లేకపోవడంతో డీజే సరిగా నడవడం లేదు. ఇటీవలే శ్రీనివాస్‌కు యాక్సిడెంట్ అయ్యి పనిచేయలేని స్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ మనస్తాపం చెంది గత నెల 28న ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం చల్మెడ ఆనందరావు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్‌ను, కుటుంబ సభ్యులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. కరీంనగర్, హన్మకొండ జిల్లా కేంద్రాల్లో జరిగిన బీఆర్ఎస్ సమీక్షా సమావేశాల్లో తాను సంబంధిత ఇన్‌చార్జ్ మంత్రులకు ఈ విషయాన్ని విన్నవించినా పెడచెవిన పెట్టారని, దళితులు అప్పుల పాలవుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటామని వాపోతున్నారని చెప్పినా మంత్రులు వినే పరిస్థితిలో లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి లబ్ధిదారుకు పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంట ఉండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులను పరామర్శించేలా చూస్తానని చెప్పారు.

# పూలే విగ్రహం ఏర్పాటుకు 12న ధర్నా

- ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు కోసం ఈ నెల 12న భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నాయి. ధర్నాలో పాల్గొనాలని ఆయా రాజకీయ పార్టీలకు, బీసీ సంఘాలకు, మేధావులు, ప్రొఫెసర్లకు భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# పోచారం అడవుల్లో అతిచిన్న అడవిపిల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో ప్రపంచంలోనే అతిచిన్నదైన అడవిపిల్లి సంచరిస్తున్నదని పరిశోధకులు గుర్తించారు. అభయారణ్యం అంచున ఉన్న 40 గ్రామాల్లో నాలుగు నెలలపాటు శోధించిన తర్వాత మచ్చలపిల్లి (అడవిపిల్లి)ని ఆ పరిశోధకులు కనుగొన్నారు. వారు దాని శాస్త్రీయ ఆధారాలనూ కనుగొన్నారు. 2023 సెప్టెంబర్‌లో తమ పనిని ప్రారంభించిన పరిశోధకులు 15 కెమెరా ట్రాప్‌లను గ్రామాల్లో ఏర్పాటుచేశారు. నాలుగు నెలల్లో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వాటిని మార్చారు. పిల్లి పరిరక్షణ ప్రాజెక్టుకు నాయకత్వం వహిస్తున్న యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ (ఏడబ్ల్యూసీఎస్) వన్యప్రాణి అధిపతి అమర్‌నాథ్ జక్కా ఆధ్వర్యంలో పిల్లి చిత్రాలతో గ్రామాల్లో తనిఖీలు చేశారు. ఆయా గ్రామస్థుల సహాయంతో చివరికి పిల్లి సంచరిస్తున్నట్టు గుర్తించారు. ఎలుకలను తినడం ద్వారా రైతులకు సహాయపడే చిన్న పిల్లిని రక్షించాల్సిన అవసరం గురించి గ్రామస్థులకు కూడా అవగాహన కల్పిస్తామని అమర్‌నాథ్ చెప్పారు. ఆయా గ్రామాల్లో రక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తామని, దీనికోసం రాష్ట్ర అటవీశాఖ మద్దతు కోసం తాము ఎదురు చూస్తున్నామని తెలిపారు.


ప్రపంచంలోనే అతిచిన్న అడవి పిల్లి